సాక్షి
అనంతపురం
శుక్రవారం । 17 । మార్చి । 2023



టన్ను చీనీ రూ.35 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.35 వేల ధర పలికాయి.



కిలో టమాట రూ.15
అనంతపురం కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 ప్రకారం పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
37.6°/19.4°

జిల్లా అంతటా గురువారం వాతావరణం మారింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గాలివేగం స్వల్పంగా పెరిగింది. గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

బడుగుల సంక్షేమ బడ్జెట్
• మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



కళ్యాణదుర్గం: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి గురువారం శాసనసభలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌ను బడుగు, బలహీన వర్గాల సంక్షేమ బడ్జెట్‌గా రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అభివర్ణించారు. పేద వర్గాలకు ఆశాజ్యోతిగా ఉందన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.2.79 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టడం గొప్ప విషయమన్నారు. విద్య, మహిళలు, రైతులకు పెద్దపీట వేశారన్నారు. డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా రూ.54,228.36 కోట్లు పథకాలకు ప్రకటించడం హర్షణీయమన్నారు. సంక్షేమ పథకాలతో సీఎం జగన్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి పేదల పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా స్త్రీ, శిశు సంక్షేమానికి రూ.3,951 కోట్లు కేటాయించడం గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు.

హంద్రీనీవాకు రూ. 270 కోట్లు



అనంతపురం సెంట్రల్: ప్రాధాన్యత ప్రకారం సాగునీటి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 270 కోట్లు హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు కేటాయించింది. గతేడాది కూడా బడ్జెట్‌లో రూ. 150 కోట్లు కేటాయించగా మధ్యలో రూ. 654 కోట్లు మంజూరు చేసినట్లు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు తెలిపారు. అలాగే తుంగభద్ర హైలెవల్ కెనాల్ (హెచ్చెల్సీ) స్టేజ్-1, స్టేజ్-2 ఆధునీకరణ పనులకు రూ. 30 కోట్ల కేటాయింపులు జరిపినట్లు వారు వివరించారు.

జిల్లాకు వర్షసూచన



అనంతపురం అగ్రికల్చర్: తమిళనాడు, గోవా, కర్ణాటక ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాగల రెండు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే.అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం అమరావతి వాతావరణ కేంద్రం నుంచి అందిన సమాచారం మేరకు రాగల రెండు రోజులు కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షపాతం నమోదు కావచ్చన్నారు. ఈదురుగాలుల వేగం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఉష్ణోగ్రతలు గరిష్టం 35 నుంచి 38 డిగ్రీలు, కనిష్టం 20 నుంచి 21 డిగ్రీల మధ్య ఉండవచ్చన్నారు. గాలిలో తేమశాతం ఉదయం 66 నుంచి 78, మధ్యాహ్నం 24 నుంచి 40 శాతం మధ్య రికార్డు కావచ్చన్నారు. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయని తెలిపారు.

ఆరుగురు విద్యార్థుల డీబార్



చున్నీల్లో ఫార్ములాలు రాసుకొచ్చిన దృశ్యం

అనంతపురం: ఎస్కేయూ పరిధిలో గురువారం నిర్వహించిన మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఆరుగురిని డీబార్ చేసినట్లు ఎస్కేయూ పరీక్షల విభాగం సంచాలకులు ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. అనంతపురంలో ఇద్దరు, కదిరిలో ఇద్దరు, గుత్తిలో ఇద్దరు డీబార్ అయినట్లు వెల్లడించారు. విద్యార్థినులు చున్నీల్లో రాసుకొచ్చి కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించి ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

ఏప్రిల్ 4 నుంచి పీజీ మూడో సెమిస్టర్
ఎస్కేయూ పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 4 నుంచి మొదలవుతాయని ఎస్కేయూ పరీక్షల విభాగం సంచాలకులు ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 6 నుంచి ప్రారంభమవుతాయన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయఢంకా

- పార్టీ ఉపాధ్యాయ అభ్యర్థి రామచంద్రారెడ్డి ఘన విజయం
- లెక్కింపు ప్రారంభం నుంచే దూసుకెళ్లిన వైనం
- రాత్రి 2 గంటలకు వీడిన ఉత్కంఠ
- కొనసాగుతున్న పట్టభద్రుల ఓట్ల కౌంటింగ్
- అధికార పార్టీ అభ్యర్థి 'వెన్నపూస' వైపే ఓటరు మొగ్గు!
- ఫలితం నేడు తేలే అవకాశం



రామచంద్రారెడ్డి విజయదరహాసం

సాక్షి ప్రతినిధి, అనంతపురం/అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలు) ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించింది. పార్టీ అభ్యర్థి రామచంద్రారెడ్డి ఘన విజయం సాధించారు. గురువారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కాగా, ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యత కనబరుస్తూ వచ్చారు. అర్ధరాత్రి 2 గంటలకు ప్రక్రియ ముగియగా, రామచంద్రారెడ్డి విజయం సొంతం చేసుకున్నారు.



ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది

ఆధిక్యంలో 'వెన్నపూస'
పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసిన వెన్నపూస రవీంద్రారెడ్డి కూడా ఆధిక్యంలో కొనసాగుతున్నారు. అర్ధరాత్రి 2 గంటల సమయానికి రెండు రౌండ్ల ఫలితాలు పూర్తికాగా వెన్నపూస రవీంద్రారెడ్డి 19,519 ఓట్లతో కొనసాగుతున్నారు. టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి 17652 ఓట్లతో రెండో స్థానంలో ఉన్నారు. పూర్తి ఫలితం శుక్రవారం సాయంత్రానికి వచ్చే అవకాశం ఉంది.

పోలింగ్ శాతం పెరగడంతోనే..
యాభై శాతం ఓట్లకు పైగా ఒక్క అభ్యర్థికీ రాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు చేపట్టారు. అందువల్లే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితం అర్ధరాత్రి తర్వాత వెలువడింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా భారీగా పోలింగ్ శాతం నమోదు కావడంతో కౌంటింగ్ ఆలస్యమైంది. ఇక.. పట్టభద్రుల ఎన్నికల్లో ఎక్కువ మంది బరిలో ఉండటం, పోలింగ్ శాతం పెరగడం వల్ల ఓట్ల లెక్కింపు జాప్యం జరుగుతోంది. ఓట్ల లెక్కింపులో మూడు షిఫ్ట్‌లలో సిబ్బంది పనిచేస్తున్నారు. ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు, కలెక్టర్‌తో పాటు పలువురు రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది విధుల్లో ఉన్నారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో కౌంటింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, చిత్రంలో ఎస్పీ

స్థానిక జేఎన్‌టీయూ అనంతపురంలో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైంది. కార్యక్రమాన్ని కలెక్టర్, జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి ఆధ్వర్యంలో ప్రారంభించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి 388 బ్యాలెట్ పెట్టెలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సబంధించి 175 బ్యాలెట్ పెట్టెల్లోని ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు.

ఆది నుంచే ఆధిక్యత
కౌంటింగ్ ప్రారంభం నుంచే పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి పూర్తి ఆధిక్యత కనబరిచారు. తొలి రౌండ్‌లో 4,756 ఓట్లతో తొలి స్థానం సాధించిన ఆయన రెండో స్థానంలో నిలిచిన ఒంటేరు శ్రీనివాసరెడ్డిపై 1,213 ఓట్ల ఆధిక్యంలో నిలిచారు. ఇక.. రెండో రౌండ్‌లోను ఆధిక్యతను నిలబెట్టుకున్న రామచంద్రారెడ్డి 4,090 ఓట్లను సాధించారు. 780 ఓట్లతో ముందంజలో నిలిచారు. మొత్తం రెండు రౌండ్లలో 8,846 ఓట్లను సాధించి మొత్తం 1,993 ఓట్ల ఆధిక్యత సాధించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఫలితం తేలకపోవడంతో అధికారులు రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించారు. ఈ క్రమంలో ఒక్కొక్కరూ ఎలిమినేట్ కాగా, చివరికి రామచంద్రారెడ్డి జయకేతనం ఎగురవేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో...	
పట్టభద్రుల ఓట్లు	3,30,124
పోలైన ఓట్లు	2,45,576
బ్యాలెట్ పెట్టెలు	388
లెక్కింపు టేబుళ్లు	24

ఉపాధ్యాయుల ఓట్లు	28,148
పోలైన ఓట్లు	25,887
బ్యాలెట్ పెట్టెలు	175
లెక్కింపు టేబుళ్లు	14

పట్టభద్రుల ఓట్ల కౌంటింగ్ ఫలితాలు ఇలా..(అర్ధరాత్రి 2గంటలకు)	
వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్ సీపీ)	19,519
భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి (టీడీపీ)	17,652
పోతుల నాగరాజు (పీడీఎఫ్)	3,552
నగరూరు రాఘవేంద్ర (బీజేపీ)	1,459

బ్యాలెట్ పెట్టెలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ సమక్షంలో అధికారులు తెరిచారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ల పెట్టెలను కేంద్రానికి తరలించారు. వాటిని సిబ్బంది కట్టలుగా కట్టి ప్రాథమిక లెక్కింపు చేపట్టారు. బ్యాలెట్ పెట్టెలను కౌంటింగ్ కేంద్రంలోకి టేబుల్ వారీగా తరలించారు. పెట్టెలను ఎన్నికల పరిశీలకులు హరిజవహర్ లాల్ తనిఖీ చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించిన అనంతరం కౌంటింగ్ సిబ్బందిని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. విధుల్లో ఉన్నవారు ఒత్తిడికి గురికావద్దని చెప్పారు. నిర్లక్ష్యంగా ఉండకుండా అప్రమత్తంగా బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. చిన్న సందేహం వచ్చినా టేబుల్ ఇన్‌చార్జ్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్పీ ఫకీరప్ప కాగినెల్లి, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, డీఆర్‌ఓ గాయత్రిదేవి పాల్గొన్నారు.

నమ్మితే నట్టేట మునిగినట్టే!

- లండన్ ఆర్చిబిషప్ నుంచి అంటూ కొన్ని రోజుల క్రితం అనంతపురంలోని ఓ వ్యక్తికి ఫోన్ వచ్చింది. గిఫ్టులు, బహుమానాలు ఇస్తామని ఆశచూపారు. దీంతో సదరు వ్యక్తి విడతల వారీగా రూ.1.10 లక్షలు పంపారు. కొరియర్ నంబర్, ట్రాక్ అంతా పకడ్బందీగానే ఉంది. షిప్‌మెంట్ ట్రాక్ కూడా బాగా చేశారు. అయితే, ఆ తర్వాత ఏమీ లేదు. చివరకు డబ్బు ఎక్కడకు వెళ్లింది అని చూస్తే.. నవీ ముంబైలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌కు చేరినట్లు తేలింది. వెంటనే తేరుకున్న ఆ వ్యక్తి బ్యాంకు అధికారులు, పోలీసులను ఆశ్రయించి ఎట్టకేలకు సొమ్ము వెనక్కు తెచ్చుకోగలిగారు.
- ధర్మవరానికి చెందిన ఓ వ్యక్తికి ఫేస్‌బుక్‌లో తక్కువ డబ్బుకే డ్రైఫ్రూట్స్ ఇస్తానని ఆశ చూపారు. షాపు చిరునామా, విజిటింగ్ కార్డు అన్నీ పంపారు. ఇంకేముంది రూ.17,800 ఫోన్ పే చేశారు. డబ్బు పడ్డాక ఆ వ్యక్తి ఫోన్ స్విచ్ ఆఫ్. బ్యాంకు డీటెయిల్స్ చూస్తే విజయవాడ యూనియన్ బ్యాంకుకు క్రెడిట్ అయిందని, అతనికి డ్రైఫ్రూట్స్ షాపు లేదని తేలింది.
- మలేషియాకు తక్కువ ఖర్చుతో పంపిస్తానని ఫేస్‌బుక్‌లో ప్రచారం చేశారు. రూ.40 వేలకే ఐదురోజుల ప్యాకేజీ అనడంతో అనంతపురంలోని 14 మంది యువకులు మొత్తం డబ్బు చెల్లించారు. చివరకు అతను ఫోన్ తీయలేదు. ఆరా తీస్తే గతంలో ట్రావెల్స్ నడిపిన విజయవాడ వ్యక్తి అని తేలింది. యువకులందరూ విజయవాడలోని ట్రావెల్ వ్యక్తి ఇంటికి వెళ్లి గొడవ చేస్తే రూ.8 లక్షల్లో మూడున్నర లక్షలు ఇచ్చారు. మిగతాది తన దగ్గర లేదని మొండికేశారు. ఇంకేముంది రిక్తహస్తంతో ఇంటికొచ్చారు.

- ఆగని ఆన్‌లైన్ మోసాలు
- అమాయకులను బురిడీ కొట్టిస్తున్న కేటుగాళ్లు
- తక్కువ ఖర్చు అనడంతో మాయలో పడుతున్న జనం
- ఆన్‌లైన్ పరిచయాలతో లావాదేవీలు చేయొద్దని పోలీసుల హితవు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: మన ఊరు కాదు..తెలిసిన వాడు అంతకన్నా కాదు. అయినా సరే గుడ్డిగా నమ్మి అకౌంటుకు సొమ్ము పంపడం .. మోసపోవడం.. ఇదీ తంతు. ఇలా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆన్‌లైన్ దొంగల చేతిలో రోజూ పదుల సంఖ్యలో బాధితులు మోసపోతున్నారు. ఫేస్‌బుక్ పరిచయం ద్వారా నమ్మడం, వేలకు వేలు పోగొట్టుకోవడం రోజూ జరుగుతోంది. ఆన్‌లైన్‌లో వచ్చే ప్రకటనలు, వ్యక్తుల ఫోన్ ఫోన్‌నెంబర్లకు ఎవరూ స్పందించొద్దు.. అలాంటి వారితో ఎలాంటి లావాదేవీలు చేయద్దు అంటూ పోలీసులు ఎంతగా మొత్తుకుంటున్నా ఏదో ఒక సందర్భంలో మోసపోతున్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసినా పార్శిల్ ఇంటికొచ్చి తెరిచి మనం బుక్ చేసింది కరెక్టేనా అని నిర్ధారించుకునే వరకూ పైసా లావాదేవీలు చేయవద్దని నిపుణులు చెబుతున్నారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలైనా సరే సరుకు ఇంటికొచ్చాకే క్యాష్ ఇచ్చేట్టు పెట్టుకోవాల్సిందే. లేదంటే మోసపోవడం ఖాయమే.

ఫేస్‌బుక్ పరిచయంతో మోసపోయా
రంజాన్ మాసం వస్తోంది వ్యాపారం చేసుకుందామనుకున్నా. ఫేస్‌బుక్‌లో నరేష్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తక్కువ ధరకే డ్రైఫ్రూట్స్ ఇస్తానని చెప్పాడు. షాపు, డ్రైఫ్రూట్స్ ఫొటోలు అన్నీ చూపించాడు. దీంతో సుమారు రూ.17 వేలకు పైగా వేశా. ఇప్పుడు ఆ వ్యక్తి పత్తాలేడు.
– సొహైల్, ధర్మవరం

ఆన్‌లైన్ ప్రకటనలు నమ్మొద్దు
ఆన్‌లైన్ ప్రకటనలు నమొద్దని ముందునుంచీ చెబుతున్నాం. వాటి ఆధారంగా లావాదేవీలు చెయ్యరాదు. వాళ్లెక్కడో ఉండి మోసం చేస్తారు. బాధితులకు రికవరీ కూడా జాప్యం జరుగుతుంది. ఫేస్‌బుక్, వాట్సాప్‌లో కొత్తగా పరిచయమయ్యే వ్యక్తులతో ఎలాంటి లావాదేవీలు చేయరాదు.
– డా.ఫక్కీరప్ప, ఎస్పీ

మంచితనమే మరణశాసనమైంది..!

కష్టాల్లో ఉన్న ఓ కుటుంబానికి అండగా నిలవడమే ఆ యువకుడి ప్రాణాలమీదికి తెచ్చింది. ఓ వ్యక్తిని నమ్మి ఫైనాన్స్ ద్వారా లోన్ ఇప్పించడమే ప్రాణాలు తీసుకునేలా చేసింది. తల్లిదండ్రులకు పుట్టెడు శోకాన్ని మిగిల్చింది. అల్లారుముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కుమారుడు తమ కళ్లముందే విగతజీవిగా పడి ఉండడం చూసి కన్నవాళ్లు చేసిన రోదనలు అందరినీ కంటతడి పెట్టించాయి. ఎంతో గొప్ప మనసుతో ఓ కుటుంబానికి అండగా నిలిచిన తమ కుమారుడిని తీసుకెళ్లడానికి నీకు చేతులెలా వచ్చాయి దేవుడా అంటూ వారు విలపించిన తీరు అక్కడి వారిని కదిలించింది.

- ఫైనాన్స్' వేధింపులకు యువకుడి బలి



కృష్ణ (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఫైనాన్స్ కంపెనీ వారి వేధింపులు తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవిశంకరరెడ్డి తెలిపిన మేరకు.. అనంతపురం ఉమానగర్‌లో నివాసముంటున్న బలరాం, లక్ష్మిదేవి దంపతులకు ఇద్దరు సంతానం. కుమార్తెకు వివాహమైంది. కుమారుడు కృష్ణ (26) ప్రభుత్వాస్పత్రిలో పెస్ట్ కంట్రోలర్‌గా పని చేస్తున్నాడు. ఉమానగర్‌లోనే నివసిస్తున్న కేశవనాయుడు ఈ కుటుంబానికి దగ్గరయ్యాడు. కృష్ణ ఆయనను చిన్నాన్న అని ఆప్యాయంగా పలకరించేవాడు. కొన్ని రోజుల క్రితం కేశవనాయుడు తనకు ఫైనాన్స్‌లో గూడ్స్ వెహికల్ ఇప్పించమని కోరగా.. శ్రీరామ్ సిటీ ఫైనాన్స్‌లో బొలేరో వాహనాన్ని కృష్ణ ఇప్పించాడు. అయితే, కేశవనాయుడు కంతులను సకాలంలో చెల్లించకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ వారు కృష్ణను వేధించడం ప్రారంభించారు. పలుమార్లు ఇంటి వద్దకు వెళ్లి గొడవ చేశారు. తల్లిదండ్రులను ఇష్టారాజ్యంగా మాట్లాడారు. కృష్ణ ద్విచక్రవాహనాన్ని సైతం లాక్కెళ్లారు. రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చి గొడవకు దిగారు. ఇలా చేయడం బాగాలేదని కృష్ణ ఆవేదన వ్యక్తం చేయగా.. నోటీసు అందజేసి నిన్ను కోర్టుకు లాగి ఆస్తి జప్తు చేయిస్తామంటూ హెచ్చరించారు. దీంతో మనస్తాపం చెందిన కృష్ణ ఇంట్లో తన గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. బాధలో ఉన్నాడు? అతన్ని ఇబ్బంది పెట్టడడం ఎందుకని కుటుంబసభ్యులూ కృష్ణతో మాట్లాడలేదు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి ఫ్యానుకు ఉరి వేసుకుని కృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం గుర్తించిన కుటుంబ సభ్యులు కిందకు దించి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే కృష్ణ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కొడుకు మృతదేహం వద్ద తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

20లోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించండి

అనంతపురం టవర్‌క్లాక్: పెన్షనర్లు ఈ నెల 20 లోపు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయరామప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే 7,000 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, ఇంకా 3000 మంది చేసుకోవాల్సి ఉందన్నారు.

వైభవంగా పుష్పయాగోత్సవం

- ముగిసిన ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు



పూజ కోసం తెచ్చిన వివిధ రకాల పుష్పాలు



అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత నారసింహుడు

కదిరి: పక్షం రోజుల పాటు సాగిన ఖాద్రీ లక్ష్మీ నారసింహుని బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి ఆలయ ప్రాంగణంలో జరిగిన పుష్పయాగోత్సవంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా సాగేందుకు సహకరించిన అష్ట దిక్పాలకులు, పంచ భూతాలు, దేవతామూర్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారిని.. వారి వారి లోకాలకు సాగనంపేందుకు నిర్వహించేదే ఈ పుష్పయాగోత్సవమని ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు. తీర్థవాది ఉత్సవం ముగియగానే బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి ఆలయం తలుపులు మూసివేసిన విషయం తెలిసిందే. తిరిగి గురువారం వేకువజామునే ఆలయ ద్వారాలు తెరిచి మహా సంప్రోక్షణ చేశారు. స్వామివారికి నిత్య పూజాది కైంకర్యాలను నిర్వహించిన తర్వాత భక్తులకు ఆలయంలో శ్రీవారి సర్వ దర్శనభాగ్యం కలిగించారు. రాత్రి సమయంలో రంగమండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఈ ఉత్సవానికి ఉభయదారులుగా విశ్రాంత స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పూల అశ్వర్థనారాయణ కుటుంబసభ్యులు వ్యవహరించారని కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ, ఈఓ పట్టెం గురుప్రసాద్ తెలిపారు.

హుండీ ఆదాయం రూ.77.69 లక్షలు
బ్రహ్మోత్సవాల్లో ఖాద్రీశుడికి హుండీ ద్వారా రూ.77,69,033 ఆదాయం వచ్చింది. దీంతో పాటు 92 గ్రాముల బంగారం, 3 కిలోల వెండి, అలాగే 12 దేశాలకు సంబంధించిన విదేశీ కరెన్సీ కూడా స్వామి వారికి భక్తులు హుండీ ద్వారా సమర్పించారు. గురువారం ఆలయంలోని హుండీలను లెక్కించారు.

క్లుప్తంగా

సీఎం జగన్‌తో ఎంపీ రంగయ్య భేటీ



అనంతపురం క్రైం: న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌ను అనంతపురం ఎంపీ తలారి రంగయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.

పోలీస్ స్టేషన్లకు సీసీ కెమెరాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లాలోని 17 పోలీస్ స్టేషన్‌కు సీసీ కెమెరాలు మంజూరైనట్లు రాష్ట్ర పోలీసు శాఖ సాంకేతిక విభాగం డీఐజీ ఏఈ రామకృష్ణకు ఏఎస్పీ నాగేంద్రుడు వివరించారు. పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాల ఏర్పాటు అంశంపై గురువారం తన కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో సాంకేతిక విభాగం డీఐజీ సమీక్షించారు. అనంతపురం నుంచి ఏఎస్పీ నాగేంద్రుడితో పాటు డీసీఆర్బీ విశ్వనాథచౌదరి, కమ్యూనికేషన్ సీఐ శ్రీకాంత్, టెక్నికల్ విభాగం ఎస్ఐ సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ మెట్లెక్కని గ్రామం!

- కక్షలకు దూరంగా గ్రామీణులు
- ఊరంతా మాంసాహారులే
- చూద్దామన్నా.. కనిపించని కోడి
- మద్యం ఊసెత్తని గ్రామస్తులు

ఊరన్న తర్వాత ఏవో చిన్నపాటి ఘర్షణలు.. కొట్లాటలు.. గొడవలు సర్వసాధారణం. అయితే గ్రామం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి కక్షలు, ఘర్షణలకు తావివ్వకుండా గ్రామస్తులంతా ఐక్యంగా కలిసి ఉన్నారంటే ఆశ్చర్యమే. మనిషిలో స్వార్థం పెరిగి పోయిన ప్రస్తుత రోజుల్లో అలాంటి గ్రామం ఏదైనా ఉందా? అని ప్రశ్నిస్తే... మేమున్నామంటూ ముందుకు వస్తున్నారు అడిగుప్ప వాసులు. గ్రామం పుట్టుక నుంచి ఇప్పటి వరకూ పోలీస్ స్టేషన్ మెట్టు ఎక్కని గ్రామంగా ఖ్యాతి గాంచిన 'అడిగుప్ప' వాసుల జీవనంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

గుమ్మఘట్ట: రాయదుర్గం నియోజకవర్గం గుమ్మఘట్ట మండలం అడిగుప్ప గ్రామం అన్నింటా ప్రత్యేకంగా నిలిచింది. దాదాపు 600 మంది జనాభాతో 125 కుటుంబాలు నివాసముంటున్న ఈ గ్రామంలో.. అందరూ వాల్మీకి (బోయ) కులస్తులే ఉన్నారు. గ్రామం మొత్తం వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తోంది. రాయదుర్గం పట్టణానికి కేవలం పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామస్తులు కట్టుబాట్లు.. ఆచారాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తారు.

మద్యం, కోడి మాంసానికి దూరం

శ్రమజీవులుగా ఉన్న బోయలు శక్తి కోసం మాంసాహారాన్ని తప్పనిసరిగా తీసుకుంటుంటారు. ఇందులోనూ అందుబాటులో ధర ఉన్న కోడి మాంసాన్ని అత్యధికంగా వినియోగిస్తుంటారు. అయితే అడిగుప్ప వాసులు మాత్రం కోడి మాంసానికి సుదూరమంటున్నారు. గ్రామంలో చూద్దామంటే కోడి సైతం కనిపించదు. మరో ఆసక్తికర విషయమేమంటే.. గ్రామంలో ఎవరూ మద్యం ముట్టరు. అంతేకాక సంపూర్ణ మద్య నిషేధిత గ్రామంగా అడిగుప్ప ఖ్యాతిని దక్కించుకుంది. శతాబ్దాలుగా వీటినే ఆచారంగా పాటిస్తూ వస్తున్నారు. అంతేకాక ఏవైనా వివాదాలు తలెత్తితే గ్రామస్తులంతా సమావేశమై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారు. ఈ నిర్ణయానికి గ్రామ ప్రజలంతా గౌరవిస్తారు. దీంతో గ్రామంలో పగలు, ప్రతీకారాలనేవి మచ్చుకైనా కనిపించవు. అంతేకాక ఇప్పటి వరకూ ఆ గ్రామస్తులు ఎవరూ పోలీస్ స్టేషన్ మెట్టు ఎక్కింది లేదు. గ్రామస్తులంతా మూకుమ్మడిగా రాజుల దేవరను ఇలవేల్పుగా ఆరాధిస్తున్నారు. ఏటా ఫిబ్రవరిలో పౌర్ణమి తర్వాత వచ్చే సోమవారం రోజున రాజుల దేవర ఉత్సవాలను నిర్వహిస్తారు.



అడిగుప్ప గ్రామం (ఏరియల్ వ్యూ)



గ్రామంలోని రాజుల దేవర ఆలయం

ఆలయాన్ని అభివృద్ధి చేయాలి



గ్రామస్తుల ఇలవేల్పుగా ఉన్న రాజుల దేవర ఆలయానికి సర్వే నంబర్ 210లో 90.34 ఎకరాలు, '36ఏ'లో 2.39 ఎకరాలు, '36బీ'లో 23.69 ఎకరాల భూమి ఉంది. దేవదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయ అభివృద్ధికి అధికారులు ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి. – రాజన్న , ఆలయ పూజారి, అడిగుప్ప గ్రామం

కట్టుబాట్లను గౌరవిస్తాం



ఎలాంటి వివాదం తలెత్తినా.. సమస్య ఎంతటి జటిలమైనా గ్రామ పెద్దలంతా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారు. పోలీస్ స్టేషన్‌కు ఎవరూ వెళ్లరు. గ్రామ కట్టుబాట్లను ప్రతి ఒక్కరూ గౌరవిస్తాం. – రాజేష్, అడిగుప్ప గ్రామం

ఒక్క కేసు కూడా నమోదు కాలేదు



గ్రామానికి సంబంధించి ఇప్పటి వరకూ ఎలాంటి వివాదం పోలీసు స్టేషన్‌కు చేరలేదు. సంపూర్ణ మద్య నిషేధిత గ్రామంగా ఆదర్శ జీవనం సాగిస్తున్నారు. పూర్వీకుల కట్టుబాట్లు, సంప్రదాయాలకు విలువనిస్తారు. – రమేష్, సర్పంచ్

చెట్టు పై నుంచి పడి వ్యక్తి మృతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని ఐదో రోడ్డులో నివాసముంటున్న శ్రీనివాసులు (50)కు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. బుధవారం ఉదయం మూడో రోడ్డుకు చేరుకున్న శ్రీనివాసులు అక్కడ తాళం వేసిన ఓ ఇంటి ఆవరణలో విరగ్గాసిన టెంకాయ చెట్టును చూసి, కాయలు కోసేందుకు సిద్ధమయ్యాడు. మట్టను పట్టుకుని చెట్టు ఎక్కుతుండగా అది ఊడి చేతికి వచ్చింది. దీంతో అదుపు తప్పి ఇంటి ప్రహరీపై పడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న ఆయన్ను స్థానికులు వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం శ్రీనివాసులు మృతి చెందాడు. ఘటనపై అనంతపురం మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

632 మంది విద్యార్థుల గైర్హాజరు

రాప్తాడు రూరల్ : ఉమ్మడి జిల్లాలో గురువారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం సంస్కృతం, తెలుగు, హిందీ, ఉర్దూ పరీక్షలకు 632 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 99 కేంద్రాల్లో 29,788 మంది విద్యార్థులకు గాను 29,156 మంది హాజరయ్యారు. వీరిలో జనరల్ విద్యార్థులు 27,203 మందికి గాను 26,663 మంది హాజరు కాగా, ఒకేషన్ విద్యార్థులు 2,585 మందికి గాను 2,493 మంది హాజరయ్యారు. 20 చోట్ల సిట్టింగ్ స్క్వాడ్ పరీక్షల తీరును పరిశీలించింది. అలాగే రాష్ట్ర పరిశీలకులు, ఆర్ఐఓ, డీఈఓలు, 5 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 69 కేంద్రాలను పరిశీలించారు.

టెక్స్‌టైల్ పార్క్‌లో కొత్త యూనిట్ల ఏర్పాటుకు చర్యలు

- జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ శ్రీరంగం అప్పాజి

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం వద్ద ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్క్‌లో కొత్త యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ శ్రీరంగం అప్పాజి తెలిపారు. టెక్స్‌టైల్ పార్క్‌లో గురువారం ఆయన యూనిట్ ఏర్పాటు దారుల సమావేశంలో మాట్లాడారు. పార్క్‌లోని 55 ప్లాట్లను ఎనిమిదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం అర్హులను గుర్తించి కేటాయించినట్లు గుర్తు చేశారు. ఇందులో ఇప్పటి వరకూ కేవలం 7 యూనిట్లు మాత్రమే నెలకొల్పారన్నారు. మిగిలిన వారు ప్లాట్లలో భవనాలు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేకపోతే కనీసం వర్క్‌షెడ్లనైనా ఏర్పాటు చేసుకుని యూనిట్లు ప్రారంభించాలన్నారు. లేకపోతే అగ్రిమెంట్లను రద్దు చేసి, ఔత్సాహికులైన మరొకరికి ఆ ప్లాట్లు కేటాయిస్తామన్నారు. నైపుణ్యం కలిగిన కూలీలు లేకపోవడం, సకాలంలో రుణాలు మంజూరు చేయకుండా బ్యాంకర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, కరోనా విపత్కర పరిస్థితుల్లో వ్యాపారాలు దెబ్బతినడం తదితర కారణాలతో తాము యూనిట్లు ఏర్పాటు చేయలేకపోయామని, తమకు 6 నెలల గడువిస్తే యూనిట్ ఏర్పాట్లు ప్రారంభిస్తామంటూ ఈ సందర్భంగా ఏడీఏకు పలువురు విన్నవించారు.

నైపుణ్యాభివృద్ధికి చర్యలు

యూనిట్ ఏర్పాటుదారుల విన్నపానికి స్పందించిన ఏడీఏ మాట్లాడుతూ.. నైపుణ్యం కలిగిన మానవవనరులను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఈ నెల 24 నుంచి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు భరోసానిచ్చారు. ఆసక్తి ఉన్న వారిని బ్యాచ్‌కు 30 మంది చొప్పున ఎంపిక శిక్షణ ఇప్పిస్తామన్నారు. అలాగే రుణాల మంజూరు విషయమై బ్యాంకర్లతో మాట్లాడి నిబంధనలు సరళీకృతం చేసేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ డీఓ జనవరాజు, ఏడీఓ మురళీమోహన్, స్థానిక టెక్స్‌టైల్ పార్క్ మేనేజర్ శివారెడ్డి, యూనిట్ ఏర్పాటు దారులు ప్రసాద్, చమ్మా ఇబ్రహీం, రవికుమార్, ఇబ్రహీం ఖలీలుల్లా, భీమనపల్లి దివాకర్, రాము, కొండి ఇబ్రహీం, రాజశేఖర్, వెంకటేశులు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంకెంత కాలం దగా చేస్తారు?

- మాజీ మంత్రి పరిటాల సునీతపై ఎమ్మెల్సీ మంగమ్మ ఫైర్
- వాల్మీకుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట వేశారు
- ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ఏకసభ్య కమిటీ అధ్యయనం చేస్తోంది



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మంగమ్మ (చిత్రంలో) లిఖిత, హరిత, మంజుల తదితరులు

అనంతపురం క్రైం: 'గత టీడీపీ ప్రభుత్వంలో వాల్మీకులను ఎదగనివ్వకుండా తొక్కిపెట్టారు. కరుడు కట్టిన ఈ నిజాన్ని దాచి వాల్మీకులను జగన్ సర్కార్ పట్టించుకోవడం లేదంటూ మాజీ మంత్రి పరిటాల సునీత మాట్లాడడం విడ్డూరంగా ఉంది. ఇలాంటి అవాస్తవాలతో ఇంకెంత కాలం వాల్మీకులను దగా చేస్తారు? వాస్తవాలను మాట్లాడితే అందరూ హర్షిస్తారు. అలా కాదంటే ప్రజాగ్రహానికి గురి కావాల్సి ఉంటుంది'అని మాజీ మంత్రి పరిటాల సునీతపై ఎమ్మెల్సీ మంగమ్మ మండిపడ్డారు. వాల్మీకుల సంక్షేమాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ పరిటాల సునీత చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. గురువారం అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. తాము అధికారంలోకి రాగానే వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చేందుకు చర్యలు చేపడతామంటూ 2014 ఎన్నికలకు ముందు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హామీనిచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి రాగానే వాల్మీకులకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అవసరమైన అన్ని చర్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారన్నారు. ఇందులో భాగంగానే సాధ్యాసాధ్యాల పరిశీలనకు ఐఏఎస్ విశ్రాంత అధికారి శామ్యూల్ ఆనంద్‌తో కూడిన ఏకసభ్య కమిటీని గుర్తు చేశారు. వాల్మీకుల అభ్యున్నతికి కృషి చేస్తున్న జగన్ సర్కార్‌పై అనవసరంగా నోరు పారేసుకోవడం మంచిది కాదని హితవు పలికారు.

- ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ మానుకింద లిఖిత మాట్లాడుతూ.. వాల్మీకుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందని, వాస్తవాలను వక్రీకరిస్తూ ఉనికి చాటుకునేందుకు వాల్మీకులను వాడుకోవాలనుకుంటే సహించబోమని హెచ్చరించారు. దశాబ్దాలుగా వాల్మీకులకు కలగా ఉన్న రాజ్యాధికారం సీఎం వైఎస్ జగనన్న పాలనలోనే నెరవేరిందన్నారు. నామినేటెడ్ పదవుల్లోనూ వాల్మీకులకు సముచిత స్థానం దక్కిందన్నారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఏడీసీసీ బ్యాంకే ఇందుకు నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాతనే ఈ బ్యాంక్‌కు తొలిసారిగా వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన తన తండ్రి వీరాంజనేయులును చైర్మన్‌గా సీఎం జగనన్న నియమించారని, ఆ తర్వాత ఆ పదవిని తనకు ఇచ్చారని గుర్తు చేశారు. వాల్మీకులను ఓటు బ్యాంక్ రాజకీయాలకు తప్ప వారి అభ్యున్నతికి ఎలాంటి చర్యలూ చంద్రబాబు చేపట్టలేదన్నది అందరికీ తెలిసిన రహస్యమన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వాల్మీకుల సంక్షేమానికి చెప్పుకోదగ్గ ఏ ఒక్క కార్యక్రమాన్ని అమలు చేయని వారు నేడు కపట ప్రేమ చూపుతూ ముందుకు రావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితలో చేర్చే అంశాన్ని అసెంబ్లీలో ఆమోదించడంతో పాటు చట్టబద్ధత కోసం పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

సమావేశంలో ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ ఎం.మంజుల, రాష్ట్ర నాటక అకాడమి చైర్‌పర్సన్ హరిత, మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకురాళ్లు రాధాయాదవ్, భారతి, శోభాబాయి, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులకు ఏనాడు పదవులిచ్చారు?



అధికారంలో ఉన్నా.. లేకున్నా.. వాల్మీకులను ఫ్యాక్షన్ రాజకీయాలకు వాడుకోవడం తప్ప ఏనాడైనా పదవులిచ్చారా? అని మాజీ మంత్రి పరిటాల సునీతను డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.వీరాంజనేయులు ప్రశ్నించారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాల్మీకులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్యాయం చేశారంటూ పరిటాల సునీత చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణ చేస్తున్నప్పుడు ఒక్కసారి ఆత్మ విమర్శ చేసుకుని మాట్లాడాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అన్ని రంగాల్లోనూ వాల్మీకులకు సముచిత స్థానం దక్కిందన్నారు. ఈ వాస్తవం తెలిసి కూడా ప్రజలను పక్కదోవ పట్టించేలా మాట్లాడడం చూస్తుంటే వాల్మీకుల జీవనంపై సునీతకు ఎలాంటి అవగాహన లేదనే విషయం అర్థమవుతోందన్నారు. 2014 ఎన్నికల సమయంలో ఓటు బ్యాంక్ కోసం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామంటూ చంద్రబాబు ఇచ్చిన హామీ వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశాన్ని పూర్తిగా తొక్కిపెట్టి.. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కంటి తుడుపు తీర్మానంతో కేంద్రానికి బిల్లు సమర్పించిన అంశాన్ని నేటికీ ఎవరూ మరవలేదన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై ఎలాంటి స్పష్టమైన హామీనివ్వకున్నా.. అధికారంలోకి వచ్చిన తర్వాత సాధ్యాసాధ్యాల పరిశీలనకు కమిటీని ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కమిటీ నివేదిక ఆధారంగా త్వరలో అసెంబ్లీలో తీర్మానం చేసి, బిల్లుకు చట్టబద్ధత కల్పించేందుకు పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లేందుకు జగన్ సర్కార్ సిద్ధంగా ఉందన్నారు.

ఎమ్మెల్యేను కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు

- టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు

రాప్తాడు రూరల్: అధికార పార్టీ ఎమ్మెల్యేను కించపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వైరల్ చేస్తున్న ముగ్గురు టీడీపీ కార్యకర్తలపై అనంతపురం రూరల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాలను సీఐ విజయభాస్కర్‌గౌడ్ గురువారం వెల్లడించారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి విరుద్ధంగా ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వివిధ పోస్టులు వైరల్ అయ్యాయి. దీనిపై నందమూరినగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇర్ఫాన్‌బాషా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో సోములదొడ్డికి చెందిన టీడీపీ కార్యకర్త చల్లా రాఘవేంద్రనాయుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. పార్టీలో చురుకుగా ఉన్న సోషల్ మీడియా కార్యకర్తలు, నాయకులు, కార్యకర్తల పేర్లు, ఫొటోలతో ఎమ్మెల్యేను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తూ సిద్ధం చేసిన పోస్టులు తమకు 'టీంపోస్ట్' అనే డీపీ ఉన్న మొబైల్ నంబరు ద్వారా అందాయని, వీటిని టీడీపీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు వైరల్ చేస్తూ వచ్చామని నిందితుడు అంగీకరించాడు. రాఘవేంద్ర నాయుడు తెలిపిన మేరకు అతనితోపాటు సిండికేట్‌నగర్‌కు చెందిన బత్తల మంజునాథ్, కట్టా లోకేష్‌పై పోలీసులు కేసులు నమోదు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పోస్టులు వైరల్ చేసే వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని ఈ సందర్భంగా సీఐ విజయభాస్కర్‌గౌడ్ హెచ్చరించారు.

పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు సీఎం కృషి

- ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



పొట్టి శ్రీరాములు పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ, పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఆత్మార్పణతో ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడయ్యారన్నారు. అమరజీవి ఆశయాలకు మాజీ సీఎం చంద్రబాబు తూట్లు పొడిచారని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు నవ నిర్మాణ దీక్షల పేరుతో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని తెరమరుగు చేసే ప్రయత్నం చేశాడని గుర్తు చేశారు. పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు ఆశయాలకనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, బీసీ కమిషన్ సభ్యుడు కిష్టప్ప, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, మైనార్టీ స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, పలువురు కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న మహిళా శక్తి సొసైటీ ప్రతినిధులు

కనగానపల్లి(రామగిరి): మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవాలని మహిళా శక్తి సొసైటీ అధ్యక్షురాలు వహీదా తెలిపారు. గురువారం రామగిరి మండలంలోని సుద్దకుంటపల్లిలో మహిళా శక్తి సొసైటీ ఆధ్వర్యంలో న్యాయసేవా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న హింస, బాల్య వివాహాలు నిర్మూలనపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా శక్తి సొసైటీ కార్యనిర్వహణాధికారి కాంచన, టింబెక్టు కలెక్టివ్ సంస్థ ప్రతినిధులు అశ్విని, సుకన్య, రమీజా, తదితరులు పాల్గొన్నారు.

దేవుని కోసం జీవించాలి

రాప్తాడురూరల్: దేవుడి కోసం జీవించాలని గుంటూరు జిల్లా వినుకొండ జీసస్ స్పీక్స్ మినిస్ట్రీస్ పాస్టర్ ఎంఆర్ రోషన్ కుమార్ కోరారు. గురువారం అనంతపురం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 33వ సర్వసభ్య సమావేశం అనంతపురం రూరల్ బళ్లారి రోడ్డులోని హోసన్నా హోలీ గాడ్ చర్చిలో జరిగింది. పాస్టర్ రోషన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యక్షుడు మార్క్ , కార్యదర్శి ఆనంద్, జాయింట్ కార్యదర్శి మనష్షే, సభ్యులు పాస్టర్ శాంతవర్ధన్, పాస్టర్‌ఎం.రూఫస్, పాస్టర్ జీవన్ బాబు, పాస్టర్ సయ్యద్ వల్లి, గౌరవ సలహాదారులు బిషప్ వాసు, అనిల్ కాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తనీయొద్దు


పి.యాలేరులో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈఓ నరసింహారెడ్డి

ఆత్మకూరు: విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని సౌకర్యాలూ కల్పిస్తోందని ఎంఈఓ నరసింహారెడ్డి ఉపాధ్యాయులకు తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ తనిఖీ చేశారు. పి.యాలేరులోని ప్రభుత్వ పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, తాజా కూరగాయలే వాడాలని ఏజెన్సీ నిర్వాహకులకు తెలిపారు. అనంతరం నాడు– నేడు కింద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

పారిశుధ్య కార్మికులపై దాడిపై ఫిర్యాదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: 14వ డివిజన్‌లో పారిశుధ్య కార్మికులపై కొందరు స్థానికులు దాడి చేసినట్లు బాధితులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం పారిశుధ్య కార్మికులు పెద్ద ఎత్తున స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 14వ డివిజన్‌లో కాలువ పూడిక తీసే విషయంలో చిన్నపోతులయ్య, పెద్ద పోతులయ్య, లక్ష్మీదేవి పారిశుధ్య కార్మికులు చిరంజీవి, భాస్కర్‌పై దాడి చేశారన్నారు. ఆసమయంలో సచివాలయం శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఆమెను సైతం బెదిరించారన్నారు. సమస్య ఉంటే నగర పాలక అధికారులు, పాలకవర్గం సభ్యులతో మాట్లాడుకోవాలన్నారు. కార్మికులపై దాడులు చేస్తే ఎలా ప్రశ్నించారు. పోలీసులు కేసు నమోదు చేసి, విచారించి న్యాయం చేస్తామని చెప్పడంతో కార్మికులు శాంతించారు.

ఇళ్ల నిర్మాణ సామగ్రి సరఫరా


ఇంటి నిర్మాణ సామగ్రి పరిశీలిస్తున్న అధికారులు

కనగానపల్లి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన నిర్మాణ సామగ్రిని లబ్ధిదారులకు అందుబాటులో ఉంచినట్లు హౌసింగ్ ఏఈ చిరంజీవి తెలిపారు. స్థానిక హౌసింగ్ కార్యాలయానికి సరఫరా చేసిన ఇంటి నిర్మాణ సామగ్రిని గురువారం ఆయన పరిశీలించారు. హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ షకీలా, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, హౌసింగ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

కేసు నమోదు

యాడికి: తన తండ్రికి క్షమాపణలు చెప్పాలని లేకపోతే అంతు చూస్తామంటూ బెదిరించిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కమలపాడుకు చెందిన లక్ష్మీనారాయణ మండల కేంద్రంలో సెలూన్ షాపు నిర్వహించేవాడు. గత జనవరి 25న యాడికికి చెందిన జాఫర్, ఖాజా కులం పేరుతో లక్ష్మీనారాయణను దూషించి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జాఫర్ కుమారులు జిలాన్, సయ్యద్‌లపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.


జేఎన్‌టీయూ కళాశాల ముందు పోలీసు బందోబస్తు


పట్టభద్రుల ఎన్నికల కౌంటింగ్ దృశ్యం


ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని తనిఖీ చేస్తున్న దృశ్యం

విజయకేతనం

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలో దిగిన రామచంద్రారెడ్డి విజయకేతనం ఎగురవేశారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను జేఎన్‌టీయూఏ కళాశాలలో గురువారం నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తుతోపాటు మెటల్ డిటెక్టర్ ఏర్పాటు చేశారు. ఉద్యోగులు, అభ్యర్థులతోపాటు అధికారులను తనిఖీ చేసి, కేంద్రంలోకి పంపారు. కౌంటింగ్ జరుగుతున్న సమయంలో అభ్యర్థులు ఉత్కంఠత నెలకొంది. జేఎన్‌టీయూఏ కళాశాల వద్ద ఉద్యోగులు, అధికారుల హడావుడితో ఆద్యంతం కోలాహలం కనిపించింది. కౌంటింగ్ పూర్తయ్యి, రామచంద్రారెడ్డి గెలిచినట్లు అధికారులు ప్రకటించగానే వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ఉపాధ్యాయవర్గాల్లో ఆనందం నెలకొంది. పట్టభద్రుల స్థానం నుంచి బరిలో దిగిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారు వెన్నపూస రవీంద్రారెడ్డి కూడా ఆధిక్యంలో కొనసాగుతున్నారు.

– అనంతపురం అర్బన్/ సాక్షి ఫొటోగ్రాఫర్లు, అనంతపురం:


విధుల్లో తలమునకలైన ఉద్యోగినులు


ఉపాధ్యాయుల ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది


కౌంటింగ్ హాలులోకి బ్యాలెట్ బాక్సు తెస్తున్న సిబ్బంది


చంటిబిడ్డతో విధుల్లో పాల్గొన్న తాడిపత్రి కానిస్టేబుల్ లక్ష్మి


కౌంటింగ్ హాల్‌లోకి మెటల్ డిటెక్టర్‌లో నుంచి వెళ్తున్న మహిళలు


బ్యాలెట్ పేపర్లు పరిశీలిస్తున్న సిబ్బంది


కౌంటింగ్ కేంద్రం వద్ద నిద్రిస్తున్న సిబ్బంది

గాయపడిన నగరపాలక సంస్థ కమిషనర్

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో కమిషనర్ కే భాగ్యలక్ష్మి ప్రమాదవశాత్తూ గాయపడ్డారు. గురువారం ఆమె నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్ నుంచి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్తుండగా, రెవెన్యూ విభాగం సమీపంలో మెట్లు దిగుతుండగా ఎడమ కాలు బెణికింది. కిందపడిపోయిన ఆమెను డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు సంపంగి రామాంజనేయులు, అనిల్ కుమార్ రెడ్డి, సీసీ ఉదయ్‌కుమార్ రెడ్డి వీల్‌చైర్‌పై కార్యాలయం ఆవరణలోకి తీసుకెళ్లారు. అక్కడి నుంచి నగరంలోని ఓ ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కమిషనర్‌కు కాలు ఫ్యాక్చర్ అయినట్లు తెలిసింది. సర్జరీ చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పినట్లు నగరపాలక సంస్థ కార్యాలయ వర్గాలు తెలిపాయి. మేయర్ వసీం కమిషనర్‌ను ఆస్పత్రిలో పరామర్శించారు. అధికారులు, కార్పొరేటర్లు కమిషనర్‌ను పరామర్శించారు.


కమిషనర్‌ను ఆస్పత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

వడ్డీ మినహాయింపు సద్వినియోగం చేసుకోండి

అనంతపురం క్రైం: ఇంటి, ఖాళీ స్థలాల పన్నుపై వడ్డీ లేకుండా చెల్లించే సదవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కోవిడ్- 19తో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలతో పాటు పన్ను సంస్కరణలతో కొందరు పన్ను చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు. వారిని దృష్టిలో ఉంచుకొని ప్రజలపై అధిక భారం పడకుండా ప్రభుత్వం ఈ నెల 31లోపు ఇంటి, ఖాళీ స్థలాల పన్నుకు సంబంధించి అరియర్, డిమాండ్‌ను ఒకేసారి చెలిస్తే వడ్డీ మినహాయింపు ఉంటుందన్నారు. నగరపాలక సంస్థ, పాతూరు, రాంనగర్, రెండో రోడ్డు సచివాలయాల్లోనూ పన్ను చెల్లింపు కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏడాదిలోపు పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ వర్తింపు :

ఇంటి, ఖాళీ స్థలం పన్ను ఒకే సారి పన్ను చెల్లిస్తే (వన్ టైం సెటిల్‌మెంట్) వడ్డీ మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వం గురువారం జీవో విడుదల చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలోపు చెల్లిస్తేనే వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని అదనపు కమిషనర్ రమణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

వందశాతం పన్ను వసూలు చేయాలి

పెండింగ్‌లో ఉన్న ఇంటి, నీటి పన్ను వందశాతం వసూలు చేయాలని అదనపు కమిషనర్ రమణారెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గురువారం నగరంలోని వివిధ సచివాలయాలతో పాటు జీసస్‌నగర్, అరవిందనగర్, రాంనగర్, తదితర ప్రాంతాల్లో జరుగుతున్న స్పెషల్ డ్రైవ్‌ను ఆయన పరిశీలించారు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం


జిల్లా గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమామోహన్‌రెడ్డి


ఎస్‌కే యూనివర్సిటీలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం సిటీ: ఆత్మార్పణతో ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు వారి గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచారంటూ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని జెడ్పీ కార్యాలయ సమావేశ భవన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహుడిగా, తెలుగు ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా చరిత్రలో చిరస్థాయిగా పొట్టి శ్రీరాములు నిలచిపోయారని ఈ సందర్భంగా ఆమె కొనియాడారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ జిల్లా శ్రీనివాసులు, బుక్కరాయసముద్రం జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు త్యాగం మరువలేనిది

అనంతపురం క్రైం: పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ముందుకెళ్దామని మేయర్ వసీం పిలుపునిచ్చారు. గురువారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో మహనీయుడి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు త్యాగాన్ని మరువలేమన్నారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేసి ప్రజలకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, అదనపు కమిషనర్ రమణారెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్లు సంపంగి రామాంజనేయులు, బాబాఫక్రుద్దీన్, కమల్‌భూషణ్, లక్ష్మి, రాజేశ్వరి, అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు దాదాఖలందర్, ఖాజా, గంగాధర్ పాల్గొన్నారు.

అనంతపురం: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమా మోహన్‌రెడ్డి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహాపురుషుడని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ఎల్‌ఎం మోహన్‌రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారిని సుబ్బరత్నమ్మ, సిబ్బంది శివశంకర్, కావేరి, బాషా, మల్లికార్జున పాల్గొన్నారు.

ఎస్కేయూ ఫార్మసీ కళాశాలలో...

ఎస్కే యూనివర్శిటీ ఫార్మసీ కళాశాలలో గురువారం అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్కే యూనివర్శిటీ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు గొప్ప స్వాతంత్య్ర సమరయోధులని కొనియాడారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మయ్య, పరీక్షల విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరమణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోమశేఖర్, ఆర్ట్స్ కళాశాల, సైన్స్ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాళ్లు బాలసుబ్రహ్మణ్యం, జీవన్‌కుమార్, రామచంద్ర, ప్రొఫెసర్లు పుష్పాంజలి, సత్యనారాయణ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాముల ఆశయాలు నెరవేరుద్దాం

అనంతపురం కల్చరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో గురువారం నివాళులర్పించారు. స్థానిక సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆర్యవైశ్య మహిళా విభాగ్ ఆధ్వర్యంలో అధ్యక్షురాలు అనురాధ, ప్రోగ్రాం కన్వీనర్ కాకుమాని చంద్రకళ, ఇందిర, శ్రీ గోవిందా వాసవీ సేవా సంఘం ఆళ్లగడ్డ రాము ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రఘు, అప్పాజీ, విజయ్, కృష్ణమూర్తి, అవోపా (ఆర్యవైశ్య ఆఫీసర్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడు జయంతి శ్రీనివాసులశెట్టి నేతృత్వంలో సంఘం సభ్యులు మంజునాథ్, జనార్దన, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


వాసవీ గోవింద సంఘం సభ్యుల ఆధ్వర్యంలో...

కనగానపల్లి: ఆంధ్రప్రదేశ్ అవతరణకు పాటుబడిన అమరజీవి పొట్టి శ్రీరాములకు పలువురు ఘన నివాళులర్పించారు. గురువారం స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల గ్రంథాలయాధికారి గోవిందు, స్థానిక సొసైటీ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'గేట్'లో మెరిసిన అనంత విద్యార్థిని


నిర్ణీత

అనంతపురం: గేట్ పరీక్షలో అనంతకు చెందిన నిర్ణీత ఆలిండియా స్థాయిలో 80వ ర్యాంకు సాధించింది. ఇంజినీరింగ్, ఉన్నత విద్య కోసం నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూట్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ లో 80వ ర్యాంకు దక్కింది. ఈమె గతేడాది ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేసింది. ఈమెకు ప్రొడక్షన్ విభాగంలో 80వ ర్యాంకు సాధించింది. విద్యార్థిని నిర్ణీత తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడుకాగా, తల్లి గృహిణి. కుమార్తె ఆలిండియా స్థాయిలో ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

హుండీ కానుకల లెక్కింపు

గుంతకల్లుటౌన్: పట్టణంలని అతిపురాతనమైన కోదండ రామస్వామి ఆలయ హుండీ కానుకలను గురువారం లెక్కించారు. హుండీల లెక్కింపు ద్వారా ఆలయానికి రూ.89,284 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ మఠం మల్లికార్జున తెలిపారు. జిల్లా దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ రామతులసి, ఆలయ అర్చకులు, హనుమాన్ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తిమ్మనచెర్లలోని రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకలను లెక్కించారు. వాటి ద్వారా రూ.36,282 ఆదాయం లభించినట్లు ఈఓ మల్లికార్జున పేర్కొన్నారు.

అశ్వవాహనంపై వేంకటేశ్వరుడు

యల్లనూరు: మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి వెంకన్న అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రధాన అర్చకుడు విజయ్ భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు.

నాయక్ నగర్ మసీదులో మేయర్ ప్రార్థనలు


నగర మేయర్‌కు స్వాగతం పలుకుతున్న మసీదు కమిటీ సభ్యులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని నాయక్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మస్‌జిదే ముజమ్మిల్‌లో గురువారం నగర మేయర్ వసీం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇటీవల నూతనంగా ప్రారంభమైన మసీదు ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. రంజాన్ మాసం మరో వారంలో ప్రారంభమవుతున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. మేయర్ మాట్లాడుతూ మసీదులు అల్లాహ్‌కు అత్యంత ప్రీతిపాత్రమైనవని తెలిపారు. మసీదుల్లో ప్రతి ముస్లిం తమ సమయాన్ని కేటాయించి అల్లాహ్ సూచించిన, మహమ్మద్ ప్రవక్త అనుసరించిన మార్గాన్ని అనుసరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్ర, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుల వివరాలు నమోదు చేయాలి


మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ సోమ్లానాయక్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రమాదంలో గాయపడిన వారి వివరాలను ఇంటిగ్రేటెడ్ రోడ్డు యాక్సిడెంట్ డేటాబేస్ అప్లికేషన్ (ఐరాడ్)లో తప్పనిసరిగా నమోదు చేయాలని ప్రాజెక్టు మేనేజర్ సోమ్లానాయక్ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏపీ అల్లోపతి మెడికల్ కౌన్సిల్, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత కమిటీ చట్టం కింద ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు, ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సురేష్, డెమో భారతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, మారుతి ప్రసాద్, గిరిధర్‌రెడ్డి, వేణు, శ్రీకాంత్, కిరణ్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు ఏర్పాట్లు చేసుకోండి

- డీఏఓ చంద్రానాయక్ ఆదేశం


భూసార పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఏఓ చంద్రానాయక్

అనంతపురం అగ్రికల్చర్: వచ్చే నెల నుంచి భూసార పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) బి.చంద్రానాయక్ ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక భూసార పరీక్షా కేంద్రం (సాయిల్ టెస్టింగ్ ల్యాబొరేటరీ–ఎస్‌టీఎల్)ను సందర్శించారు. ఏడీఏ రోజాపుష్పలతో కలిసి టెక్నికల్ ఏఓలు నాగేంద్ర, ఉమా మహేశ్వరి, ఇతర టెక్నీషియన్లతో ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్రీయ కృషి వికాస యోజనా (ఆర్‌కేవీవై) కింద కేంద్రం నుంచి 2024–2026 వరకు యాక్షన్‌ప్లాన్ విడుదలైందన్నారు. మట్టి పరీక్షల సేకరణ, ఎన్–పీ–కే (నత్రజని–భాస్వరం– పొటాష్) శాతం విశ్లేషణ, జింక్, బోరాన్, మెగ్నీషియం లాంటి సూక్ష్మపోషకాల శాతం తెలుసుకునే పరీక్షలకు అవసరమైన పనిముట్లు, సామగ్రి, రసాయనాలు, నీరు, సిబ్బంది, ఇతరత్రా మౌళికవసతులు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. 25 నాటికి సిద్ధం చేసుకుంటే 30వ తేదీ నాటికి అందరికీ శిక్షణ పూర్తీ చేస్తామన్నారు. వచ్చే నెల నుంచి షెడ్యూల్ ప్రకారం మట్టి పరీక్షల నిర్వహణ, ఫలితాల విశ్లేషణ, రైతులకు ఎరువుల సిఫారసు పత్రాలు తదితర వాటిని ప్రణాళిక ప్రకారం చేయాల్సి వుంటుందని తెలిపారు.

సామూహిక సీమంతాలు

అనంతపురం కల్చరల్: నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం సామూహిక సీమంతాలు ఘనంగా జరిగాయి. స్థానిక పుట్టినిల్లు ఆశ్రమంలో డాక్టర్ నిర్మల మురళీ నేతృత్వంలో పదిమంది గర్భిణులకు సీమంతం చేశారు.